క్లుప్తంగా

నివాళి



ప్రేమకుమారి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: స్థానిక బజారు వీధిలోని దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు హరినాథ్ బాబు సతీమణి ప్రేమ కుమారి అనారోగ్యంతో మరణించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆమె భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ కంట ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



చిత్ర పటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు తదితరులు

నారాయణవనం : ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఈఓపీఆర్‌డీ డాక్టర్ వేణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్లాస్టిక్ వాడకం అరికట్టడంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బుట్టలో పెట్టు- పుస్తకాలను చేతపట్టు నినాదంతో బాల్యం నుంచే పిల్లలకు నేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, కార్యదర్శి రవికుమార్, హెచ్‌ఎం మమత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. వైద్యులు సంతోష్‌కుమార్, రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పెయిన్ కిల్లర్స్‌తో దుష్ప్రభావాలు అధికంగా ఉంటాయని, ఇతర వ్యాధులకు దారి తీస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కసమనంబేడు గ్రామంలోని మిట్ట, పల్లం హరిజనవాడ, ఎస్టీ కాలనీలో శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ జనార్ధన్, గ్రామ కార్యదర్శి వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో డ్రైనేజీ కాలువల్లో మురుగును తొలగించి మలాథియాన్ పిచికారీ చేశారు. వీధుల్లో చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రఘురామకృష్ణరాజుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు నీలం సాహ్నీ, రాణి కుముదిని వేర్వేరుగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పూలే సేవలు ఆదర్శప్రాయం



సత్యవేడు: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ, చిత్రంలో పూలే వేషధారి

శ్రీకాళహస్తి: సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకులు జ్యోతీబా గోవిందరావ్ పూలే ఆదర్శప్రాయులని మండల విద్యాశాఖ అధికారిణి భువనేశ్వరి అన్నారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ, ఆనాటి సమాజంలో అసమానతలను రూపుమాపడంలో పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని కీర్తించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఇతోధికంగా సేవ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు శోభారాణి, సీఆర్ ఎంటీలు మునిమోహన్, గాంధీ, హేమలత, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది లలిత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో కండ్రిగ ఉమ, ప్రియాంక, లత, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో పలు చోట్ల పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

టీపీఎం కండ్రిగలో..

శ్రీకాళహస్తి : మండలంలోని టీఎంపీ కండ్రిగలో జ్యోతిబా పూలే జయంతిని ఏపీ బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలేను ఆదర్శంగా తీసుకుని యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, మునిరామిరెడ్డి, మోహన్, మారి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట రమణ విలాస్ కూడలిలోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి ఆషా సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, ఆకాంక్ష సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు, డాక్టర్ కోదండరామిరెడ్డి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి, చంద్రారెడ్డి, సీపీఎం నాయకులు, వార్డ్ మెంబర్ ఎంజీ రెడ్డి, యాదవ సంఘం నాయకులు వెంకటాద్రి యాదవ్, విద్యాసాగర్ తదితరులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. బహుజనుల కోసం పూలే చేసిన సేవలను కొనియాడారు.



శ్రీకాళహస్తి ఎంఈఓ కార్యాలయంలో..



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సత్యవేడు : బాలురు గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి, తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయినిగా తీర్చిదిద్దారన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ సురేష్, కో-ఆప్షన్‌సభ్యుడు దినకర్, ఉపాధ్యాయులు మల్లికార్జున, సురేష్, భువనేశ్వరి పాల్గొన్నారు.

సుబ్రమణ్యం మృతికి సంతాపం





సుబ్రమణ్యం పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్ తదితరులు, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారకాయలు సోదరుడు సుబ్రమణ్యం మృతికి పలువురు సంతాపం తెలిపారు. శుక్రవారం ఉదయం ఈ మేరకు పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి సర్పంచ్‌లు నాగూరు, ఎంపీటీసీ సభ్యుడు రవి, నేతలు పళనిరెడ్డి, అశోక్, సుబ్రమణ్యం, గోపాల్ తదితరులు సుబ్రమణ్యం భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ పుష్పాంజలి ఘటించారు.

పరిశ్రమలకు నిరంతర విద్యుత్



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్ర నాయుడు

శ్రీసిటీ : పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా దశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర నాయుడు తెలిపారు. శుక్రవారం శ్రీసిటీలో పుత్తూరు డివిజన్, తిరుపతి ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్షించారు. అలాగే పరిశ్రమల ప్రతినిధులతో కూడా ఆయన సమావేశమయ్యారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సంబంధించి పలు సూచనలు తీసుకున్నారు.

వైభవం.. పంగునోత్తర ఉత్సవం



అంతరాలయ ఉత్సవంలో అమ్మవారితో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా పంగునోత్తర ఉత్సవం నిర్వహించారు. ఉభయకర్తల చేతులమీదుగా మహిళలకు పసుపు, కుంకుమ, రవిక, గాజులతో తాంబూలం, ప్రసాదాలు అందించారు. అలాగే, రాత్రి అమ్మవారి సన్నిధిలో భోగశ్రీనివాసునికి ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకుడు శ్రీధర భట్టాచార్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌష్టికాహారంపై అవగాహన



సత్యవేడు:మాట్లాడుతున్న డాక్టర్ అరుణ్‌కుమార్

సత్యవేడు : మండలంలోని కోటమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్ పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, దాసుకుప్పం ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎం మేరి, సీహెచ్‌ఓ షణ్ముగం, ఎంఎస్‌కే సునీత, వరలక్ష్మి, సుప్రియ, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు అనూరాధ, ఎం.భువన, కె.శశికళ, వి.కుమార్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఆమందూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. అనంతరం పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను వండి వడ్డించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ, టీచర్లు సునీత, బాటముని అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, సునీత, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలలో ఔషధ గుణాలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలలో ఔషధ గుణాలు ఉంటాయని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, దీంతో శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు యమున, జ్యోతి తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న పంచాయతీ సిబ్బంది

నారాయణవనం : నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధి వీధిలో అక్రమ కట్టడాల తొలగింపునకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ కాలువను దాటి ముందుకొచ్చి నిర్మాణాలను చేపట్టడంతో సన్నిధివీధిలో వాహనాల రాకపోకలకు, స్వామి వారి వాహన సేవలకు ఇబ్బందులు తప్పలేదు. దీనిపై స్థానికుడు నెడుంయన్ పలుమార్లు టీటీడీకి, పంచాయతీకి ఫిర్యాదు చేశాడు. స్పందన లేకపోవడంతో హైకోర్టులో కేసు వేశాడు. దీంతో టీటీడీ రెవెన్యూ అధికారులు స్పందించి రెండు వారాల క్రితం ఆక్రమణలకు మార్కింగ్ చేసి తొలగించాలని సూచించారు. సన్నిధివీధి వాసులు స్పందించకపోవడంతో కలెక్టర్‌కు టీటీడీ అధికారులు నివేదించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది అక్రమ కట్టడాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈనెల 18వ తేదీలోపు మురుగు కాలువ వరకు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించకుంటే, యంత్రాలతో కూల్చేస్తామని స్పష్టం చేశారు.

ఇనుప కమ్మీల చోరీకి యత్నం

– ట్రాక్టర్ వదలి పరారైన నిందితులు

ఏర్పేడు(రేణిగుంట): ఇనుప కమ్మీల చోరీ యత్నం బెడిసి కొట్టడంతో ట్రాక్టర్‌ను వదలి నిందితులు పరారైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు.. ఏర్పేడు మండలం చిందేపల్లె సమీపంలోని జగనన్న కాలనీలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇనుప కమ్మీలు నిల్వ ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడున్న 12ఎంఎం సైజున్న 55 ఇనుప కమ్మీలను ట్రాక్టర్‌లో వేసుకుని చోరీకి ప్రయత్నించగా అక్కడ ఉన్న వ్యక్తులు గుర్తించి కేకలు వేయడంతో నిందితులు ట్రాక్టర్‌ను వదిలి పారిపోయారు. హౌసింగ్ ఏఈ కనక సత్యకుమార్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు పరిశీలించారు. సంఘటన స్థలంలో సోనాలికా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్ మండలంలోని మడిబాకకు చెందిన మునిరత్నం నాయుడు కుమారుడు తేజది అని గుర్తించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఐఐటీలో 5-కె ఫిట్‌నెస్ రన్ రేపు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 6గంటలకు 5-కె ఫిట్‌నెస్ రన్ నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్ పెంపొందించే లక్ష్యంతో 500మందితో 5కె రన్ ప్రారంభమవుతుందని, రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. యువతీ యువకులు, మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. ఈ రన్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులిస్తామన్నారు. పాల్గొన్న వారందరికీ టీ షర్ట్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఇతర వివరాలకు టి.శ్రీధర్‌రెడ్డి(8688795343)ని సంప్రదించాలని కోరారు.

కార్మికుల సమ్మె విరమణ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్మికుల సమ్మెకు శుక్రవారం తెరపడింది. తమ డిమాండ్ల సాధన కోసం మూడురోజులుగా సమ్మె చేస్తుండడంతో పట్టణంలో పారిశుధ్యం సమస్యలు తలెత్తాయి. డివిజన్ పంచాయతీ అధికారి ప్రభురెడ్డి, ఈఓపీఆర్‌డీ ప్రభురావు, పంచాయతీ కార్యదర్శి మణి కార్మికులతో చర్చించారు. రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. ప్రజా సంఘాల నాయకులు ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తిక్, నాయకులు మురళి, భాను, శ్రీనివాసులు, చంద్రకళ, సుబ్బరాజు, రమణ, పురుషోత్తం, షణ్ముగం, వెంకటమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

42 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు(రేణిగుంట): పాపానాయుడుపేట సమీపంలో 42 బస్తాల రేషన్ బియ్యం (1,474 కిలోలు) అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తుండగా శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు. దీనికి సంబంధించి కేవీబీ పురం మండలం కోవనూరుకు చెందిన గుర్రంకొండ మనోజ్ కుమార్ అలియాస్ సాంబార్ మనోజ్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇతడు తమిళనాడుకు తరలించి ఎక్కువ ధరకు విక్రయించేవాడని తేలిందన్నారు.

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- నాగలాపురం : సుబ్బానాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని ఏడీ రమేష్ చంద్ర, ఏఈ పృథ్వీ తెలిపారు.
- రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని ఎల్లమండ్యం, కురకాలువ, గురవరాజుపల్లె, గాజుల మండ్యం, తూకివాకం, కరకంబాడి సబ్ స్టేషన్ల పరిధిలో 11 కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు తెలిపారు.

నియామకం



కేవీ బాబు (ఎంటెక్ బాబు)

వరదయ్యపాళెం : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సంస్థాగత కార్యదర్శిగా వరదయ్యపాళెం మండలం అరుదూరుకు చెందిన కేవీ బాబు (ఎంటెక్ బాబు)ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా జమున

రేణిగుంట: వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలిగా ఏర్పేడు మండలం పాత వీరాపురం గ్రామానికి చెందిన ఎస్.జమునను నియమిస్తూ పార్టీ అధిష్టానం నియామక పత్రం జారీ చేసింది. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

-ఆర్డీఓ భానుప్రకాశ్ రెడ్డి

శ్రీకాళహస్తి: భూముల రీ-సర్వే పారదర్శకంగా చేస్తున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాశ్ రెడ్డి చెప్పారు. మండలంలోని మన్నవరంలో శుక్రవారం రీ-సర్వే గ్రామసభ నిర్వహించారు. రైతుల సమక్షంలోనే వివాదాలకు తావులేకుండా రెవెన్యూ సిబ్బంది రీ-సర్వే చేస్తున్నారన్నారు. గ్రామ సభ ఏర్పాటు చేసి రీ సర్వే పనులు మొదలెడుతామని, రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ సభలో స్వీకరిస్తామన్నారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఐఓఎస్ రాంప్రసాద్, మండల సర్వేయర్ పురుషోత్తం, వీఆర్వో వినోద్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

30 మందికి వైద్యసేవలు

సత్యవేడు: మల్లవారిపాళెం ఈస్టు పంచాయతీ రామచంద్రాపురంలో శుక్రవారం పాండూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. 30 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. అనంతరం గ్రామంలో ఫీవర్‌సర్వే చేపట్టారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నీటి నమూనాలు సేకరించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ రవీంద్ర, ఏఎన్‌ఎం కోషి పాల్గొన్నారు.

కిరణ్‌ను రక్షించేందుకే నాటకం

వరదయ్యపాళెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ నేత చేబ్రోలు కిరణ్‌కు భద్రత కల్పించేందుకే అరెస్టు పేరుతో పోలీసులు నాటకమాడుతున్నారని పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ,నిందితుడికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టే సంస్కృతికి ఐటీడీపీ ఫుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు.

రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తాం

ఏర్పేడు(రేణిగుంట): రైతుల సంక్షేమం కోసం నిర్మాణాత్మక చట్టాలు చేయాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల సేవలో మునిగి తేలుతున్నాయని, తాము రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రంగయ్య అన్నారు. శుక్రవారం అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినం పురస్కరించుకుని ఏర్పేడు మండలం కందాడలో జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పి.ధర్మారెడ్డి, మాసేపల్లి నాగరాజు రాయల్, వాకా భాస్కర్ రెడ్డి, సి.మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో గ్రాడ్యుయేషన్ డే

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీఎస్ రత్నం, కళాశాల ఏఓ మహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల గొడవ: మహిళకు గాయాలు

రేణిగుంట: భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల గొడవలో ఓ మహిళకు గాయాలైన సంఘటన శుక్రవారం శ్రీకాళహస్తి మండలం తొండమనాడు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం..తొండమనాడులో ఎం.మునెమ్మ కుటుంబ సభ్యులకు, కుసుమ, లోకేశ్వరరెడ్డి కుటుంబాలకు నడుమ కొంత కాలంగా భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్ద మరోసారి ఇరువర్గాల మధ్య తలెత్తిన వాగ్వాదం తోపులాటకు దారితీసింది. తోపులాటలో మునెమ్మ రాయిపైన పడటంతో తలకు తీవ్రగాయమై స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను కుటుంబీకులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. బాధితురాలి కుమారుడు మునెయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.